7

సాక్షి మెదక్

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



తేనె పట్టేద్దాం

శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై రైతులు దృష్టి సారించేలా ములుగులోని అటవీ కళాశాల మరియు పరిశోధన సంస్థ శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తోంది. 8లో

నలుగురికి కరోనా




మెదక్‌జోన్: జిల్లావ్యాప్తంగా గురువారం 50 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా నలుగురికి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు జిల్లా వైద్యాధికారి చందూనాయక్ తెలిపారు. మెదక్‌లో మూడు, తూప్రాన్‌లో ఒక కేసు నమోదైందని చెప్పారు. ప్రజలు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని సూచించారు.



ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. గురువారం మనోహరాబాద్ మండల పరిధిలోని పలువురికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. 9లో



న్యూస్‌రీల్

పాఠశాలలో ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఈఓ రాధాకిషన్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను డీఈఓ రాధాకిషన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం పరీక్షలను పరిశీలించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం నర్సింహరావుకు పలు సూచనలు చేశారు.

ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ నేతలు



ముస్లింలతో గాలి అనిల్‌కుమార్, అంజన్‌కుమార్ యాదవ్

నర్సాపూర్: టీపీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్ గురువారం నర్సాపూర్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముస్లింతో కలిసి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులుగౌడ్, మల్లేష్, రవీందర్‌రెడ్డి, చిన్న అంజిగౌడ్ నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పాత వాహనాల వేలం

మెదక్ మున్సిపాలిటీ: వేలం పాటలో కొనుగోలు చేసిన వాహనాలను వ్యక్తిగతంగా వాడుకోవద్దని, కేవలం స్క్రాప్‌లో వినియోగించాలని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని సూచించారు. గురువారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్క్రాప్‌గా మిగిలిన 102 వాహనాలకు అవుసులపల్లి శివారులోని నూతన జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. మొత్తం 35 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, మెదక్ రూరల్ సీఐ విజయ్, నర్సాపూర్ సీఐ షేక్ లాల్‌మదర్, ఆర్‌ఐలు అచ్యుతరావు, ఆర్‌ఎస్‌లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయతతో ఐక్యత చాటుదాం

మెదక్ మున్సిపాలిటీ: రెడ్డి ఆత్మీయ సమ్మేళనంతో ఐక్యత చాటుదామని రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా కన్వీనర్ ఒంటరి రాజేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలో ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 28వ తేదీన మెదక్ పట్టణంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో జిల్లా సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయిస్తామని సీఎం కేసీఆర్ మేనిఫెస్టోలో పెట్టారని గుర్తుచేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అన్ని విభాగాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ సమితి జిల్లా కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, సాయిరెడ్డి ప్రతినిధులు ప్రభురెడ్డి, భాగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'దళితులకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలి'

కౌడిపల్లి(నర్సాపూర్): రాజ్యాంగాన్ని మారుస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎలా ఆవిష్కరిస్తారని బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాష ప్రశ్నించారు. గురువారం మండలంలోని వెంకట్రావుపేట గేట్ వద్ద విలేకరులతో మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా సీఎం కేసీఆర్ దళితులను మోసం చేస్తున్నాడని విమర్శించారు. తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి దళితుడని ప్రకటించి అధికారంలోకి రాగానే మాటమార్చి మోసం చేశాడని మండిపడ్డారు. దళితులకు క్షమాపణ చెప్పిన తర్వాతే అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీధర్‌యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాజేందర్, మండల అధ్యక్షుడు రాకేష్, మండల ఇన్‌చార్జి గోడ రాజేందర్, నాయకులు రఘువీరారెడ్డి పాల్గొన్నారు.

కొత్తవి ఇవ్వరు.. పాతవి మార్చరు!

- రేషన్ కార్డుల కోసం ఏళ్లుగా ఎదురుచూపు
- ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్న పేదలు



మెదక్ పట్టణానికి చెందిన ఈమె పేరు సునీత. ఐదేళ్ల క్రితం దత్తుతో పెళ్లయింది. ఇద్దరు పిల్లలున్నారు. భార్యాభర్తలు కులవృత్తి చేసుకుంటూ బతుకుతున్నారు. రేషన్‌కార్డు కోసం నాలుగేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు మంజూరు కాలేదు. మహిళా సంఘంలో చేరాలంటే రేషన్ కార్డు అడుగుతున్నారని.. కూలీ చేసుకొని బతికే తమకు రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని సునీత ఆవేదన వ్యక్తం చేశారు.



ఈయన పేరు గజ్జెల బాలపోచయ్య. హవేళిఘణాపూర్ మండలం మద్దుల్వాయి గ్రామానికి చెందిన ఇతడికి ఐదేళ్ల క్రితం పెళ్లయింది. ఇద్దరు పిల్లల పేర్లు రేషన్ కార్డులో చేర్చాలని రెండేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నాడు. ఇంతవరకు అది జరగలేదు. పిల్లలను స్కూల్‌లో చేర్పించాలన్నా.. కులం, ఆదాయ సర్టిఫికెట్లు కావాలన్నా..రేషన్ కార్డు అడుగుతున్నారని బాలపోచయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.



మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంలేదు. ఇప్పటికే ఉన్న వాటిలో మార్పులు చేర్పులు చేయడంలేదు. జిల్లాలో వేలాదిమంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మార్పులు, పిల్లల పేర్లు చేర్చడం కోసం 14,537 మంది అర్జీ పెట్టుకున్నారు. అయినా ఇప్పటివరకు కొత్త కార్డులు రాకపోవడంతో పాటు మార్పులు చేర్పులు సైతం జరగలేదు.

పేదలకోసం..

కూలీలు, పేదలను ఆదుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉత్పత్తి పంపిణీ పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా దారిద్య్రరేఖకు దిగువన ఉన్నవారికి బియ్యంతో పాటు, నిత్యావసర సరుకులు అందజేస్తారు. గతంలో బియ్యం, చక్కెర, కిరోసిన్, గోధుమలు, పప్పు, చింతపండు, కారం తదితరాలు అందించేవారు. ఇప్పుడు బియ్యం మాత్రమే ఇస్తున్నారు.

జిల్లాలో 2,14,090 రేషన్ కార్డులు

జిల్లాలో 2,14,090 రేషన్ కార్డులున్నాయి. వీటిలో ఆహార భద్రత కార్డులు 2,00,229, అంత్యోదయ 13,794, అన్నపూర్ణ కార్డులు 67 ఉన్నాయి. 521 రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు బియ్యం అందజేస్తున్నారు. 2019 నుంచి డిసెంబర్ 2022 వరకు కరోనా మహమ్మారి అతలాకుతలం చేసింది. అప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని నెలలపాటు ఒక్కోవ్యక్తికి 10 కిలోల చొప్పున బియ్యం ఉచితంగా సప్లై చేశారు. లాక్‌డౌన్ టైంలో ఒక్కో వ్యక్తికి 15 కిలోల చొప్పున ఇచ్చారు. కరోనా తగ్గుముఖం పట్టడంతో ఈ ఏడాది జనవరి నుంచి ఒక్కో వ్యక్తికి 5 కిలోల బియ్యాన్ని మాత్రమే సరఫరా చేస్తున్నారు.

సమాచారం లేదు

కొత్త రేషన్‌కార్డుల సమాచారం లేదు. గత ఏడాది జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా 2,300 కార్డులు అందజేసింది. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే ప్రక్రియ నిలిపేశారు. కార్డుల్లో మార్పులు, చేర్పులు కూడా జరగడంలేదు.

– శ్రీనివాస్, డీఎస్‌ఓ, మెదక్

ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహిస్తాం

కలెక్టర్ రాజర్షిషా



టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, తదితరులు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశామని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, పకడ్బందీ చర్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. లారీలు, గోనె సంచుల సమస్య ఉత్పన్నం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రికి వివరించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతా శేఖర్‌గౌడ్, అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేశ్, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రపాల్, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. టెండర్లకు ఎవరూ ముందుకురాని పక్షంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. అగ్రిమెంట్ ప్రకారం కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసేలా చూడాలన్నారు. సమావేశంలో పంచాయతీ రాజ్ ఈఈ సత్యనారాయణరెడ్డి, డిప్యూటీ ఈఈ పాండురంగారావు, రహదారులు, భవనాల డిప్యూటీ ఈఈ వెంకటేశం, ఇంజనీరింగ్ అధికారులు, ఆర్డీఓ సాయిరాం, ఏజెన్సీ ప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

స్వరాష్ట్రంలో తీరిన గోస



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, తదితరులు

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): తెలంగాణ రాక ముందు పల్లెల్లో సావు స్నానాలకు నీళ్లు లేని దుస్థితి ఉండేదని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మీనగర్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశంతో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రజలు పడరాని పాట్లు పడ్డారన్నారని గుర్తు చేశారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. స్వరాష్ట్రంలో ఏమూల చూసినా పుష్కలంగా నీళ్లు ఉన్నాయని అన్నారు. 24 గంటల కరెంట్ సరఫరాతో పాటు పుష్కలంగా పంటలు పండి రైతు ఆత్మహత్యలు కనుమరుగయ్యాయని పేర్కొన్నారు. సొంత ఇంటి నిర్మాణానికి రూ. 3 లక్షలు ఇస్తామని తెలిపారు. మూడోసారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో ప్రభుత్వం చేపట్టిన పనులను గుర్తు చేసుకోవడానికే ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రసంగం ముగియగానే పలువురు మహిళలు స్టేజీ వద్దకు వెళ్లి పింఛన్లతో పాటు పలు సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేశారు. కార్యక్రమంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ షర్మిలా శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రైతు సమన్వయ సంఘం అధ్యక్షుడు సోములు, వైస్ ఎంపీపీ విష్ణువర్ధన్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జగన్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుబేరుడు, ఏఎంసీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మల్లేశం, సర్పంచ్ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'దళిత బంధు'

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): రాష్ట్రంలో అర్హులైన దళిత కుటుంబాలకు దళితబంధు పథకం అమలు చేస్తామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బిజ్లిపూర్‌లో దళిత నాయకుడు పోచయ్య ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న దళితులను ముందుకు తీసుకెళ్లేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చేసిన శాసనం ద్వారా నేడు అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను సర్పంచ్ లక్ష్మి వారి దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్య, ఎంపీటీసీ నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, మండల కో అప్షన్ మెంబర్ లాయక్, ఉప సర్పంచ్ జంగీర్, దళిత సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

16న ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష

మెదక్ కలెక్టరేట్: ఈనెల 16న ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈఓ రాధాకిషన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా హాల్‌టికెట్లు తీసుకోవాలన్నారు. ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఈనెల 16న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు పరీక్ష సెంటర్లకు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

తూప్రాన్: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశాలను అందిపుచ్చుకోవాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో నాబార్డ్ సహకారంతో బ్యూటీషన్ కోర్సులో శిక్షణ పొందిన 35 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం వివిధ అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెదక్ మెప్మా అర్బన్ పీడీ ఇందిరా, మున్సిపల్ కమిషనర్ మోహన్, చైర్మన్ రవీందర్‌గౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో శాంతిభద్రతల పరిరక్షణ

ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

మనోహరాబాద్(తూప్రాన్): శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని అన్నారు. గురువారం మండలంలోని ముప్పిరెడ్డిపల్లిలో నియో సీడ్, ప్రైమా, వీఎస్టీ పరిశ్రమల సహకారంతో ఏర్పాటు చేసిన 30 సీసీ కెమెరాలను సర్పంచ్ నరాల ప్రభావతితో కలిసి ప్రారంభించారు. అలాగే మండలంలోని ధర్మరాజ్‌పల్లిలో తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణరెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ చంద్రశేఖర్ సహకారంతో ఏర్పాటు చేసిన 10 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడమే కాకుండా నిత్యం వాటిని పర్యవేక్షించాలని సూచించారు. మరమ్మతులను ఎప్పటికప్పుడు చేయించే బాధ్యత గ్రామ పంచాయతీలే తీసుకోవాలన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్ఆర్ కింద ముందుకు వచ్చి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారులో సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్‌ఐ సందీప్‌రెడ్డి, మండల రైతు కో–ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, పరిశ్రమల ప్రతినిధులు, కార్యదర్శులు స్వామి, నవీన్‌కుమార్, పాలకవర్గ సభ్యులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వం టీచర్ల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మారావు కోరారు. గురువారం టీఎస్‌యూటీఎఫ్ 10వ వార్షికోత్సవం సందర్భంగా యూటీఎఫ్ కార్యాలయం ఎదుట జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని వేసవి సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు నిర్వహించేలా చొరవ తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుధాకర్, నాయకులు శేఖర్, శీతల్ సింగ్, ప్రేం కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్షను రూపుమాపాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్



పాదయాత్ర నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

మెదక్ రూరల్: కుల వివక్షను రూపుమాపేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. గురువారం సామాజిక న్యాయం..కుల వివక్ష నిర్మూలన కోసం హవేళిఘణాపూర్ నుంచి మెదక్ కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటికీ కుల వివక్ష ఏదో ఒక రూపంలో కొనసాగుతుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో కులం పేరు తెలుసుకోనిదే కనీసం ఇంటిని అద్దెకు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. అనేక గ్రామాల్లో మధ్యాహ్న భోజన పథకంలో దళితులు వండితే అగ్రవర్ణాల పిల్లలు తినడం లేదన్నారు. జస్టిస్ పున్నయ్య సిఫారసుల ప్రకారం ప్రతి నెల ఒక గ్రామంలో ఎంపీడీఓ, తహసీల్దార్, ఎస్‌ఐతో అవగాహన సదస్సులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్‌రెడ్డి, బసవరాజ్, ఉపాధ్యక్షులు మల్లేశం, నాగరాజు, కోశాధికారి నర్సమ్మ, నాయకులు మెయినోద్దీన్, షౌకత్ హాలీ, ప్రవీణ్, సంతోష్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

వేగానికి కళ్లెం

- రాజీవ్ రహదారిపై 40 స్పీడ్ లిమిట్
- గెజిట్ విడుదల చేసిన ఆర్‌అండ్‌బీ
- గ్రామాలు, మార్కెట్, స్కూల్ జోన్ల వద్ద ఏర్పాటు
- నిబంధనలు మీరితే జరిమానాలు



రాజీవ్ రహదారి

సాక్షి, సిద్దిపేట: రోడ్డు ప్రమాదాల నివారణకు అధికార యంత్రాంగం నడుం బిగించింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి మార్చి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 118 రోడ్డు ప్రమాదాలు జరుగగా, 53 మంది మృతిచెందారు. మరో 98 మందికి గాయపడ్డారు. ఇందులో ఎక్కువ శాతం రాజీవ్ రహదారిపై జరిగిన ప్రమాదాలే ఎక్కువ. వీటి నివారణకు చర్యలు తీసుకునేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు కార్యాచరణ రూపొందించారు. రాజీవ్ రహదారిపై గ్రామాలు, మార్కెట్, స్కూల్ జోన్ల వద్ద స్పీడ్ లిమిట్‌ను గంటకు 40కిలో మీటర్లకు తగ్గిస్తూ గెజిట్‌ను విడుదల చేశారు. కొత్త నిబంధనలతో రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుంది.

40 కిలో మీటర్లకు పరిమితం..

- జిల్లా పరిధిలో రాజీవ్ రహదారి ములుగు మండలం వంటిమామిడి వద్ద ప్రారంభమై బెజ్జంకి మండలం దేవక్కపల్లి వద్ద ముగుస్తుంది.
- 96.2 కిలో మీటర్లు ఉన్న ఈ రోడ్డుపై ఇప్పటికే 80కిలో మీటర్లను స్పీడ్ లిమిట్ ఉండగా, ప్రస్తుతం వంటిమామిడి నుంచి దేవక్కపల్లి రోడ్డు వరకు 28 చోట్ల స్పీడ్ లిమిట్‌ను తగ్గించారు.
- వంటిమామిడి, మార్కెట్ ఏరియా, ఫారెస్ట్ కళాశాల, ములుగు, వర్గల్ జంక్షన్, గౌరారం, పాతూరు వెజ్ మార్కెట్, ప్రజ్ఞాపూర్, రిమ్మనగూడ, కొడకండ్ల, చిన్నకిష్టాపూర్ రోడ్డు, లకుడారం మాత్‌పల్లి క్రాస్ రోడ్డు, తిమ్మారెడ్డి పల్లి, కొమురవెల్లి కమాన్, మెదక్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో స్పీడ్ లిమిట్ ఉంటుంది.
- వీటితో పాటు కొండపాక రోడ్డు, జనగామ క్రాస్ నుంచి టోల్ ప్లాజా, దుద్దెడ, దర్గా, పొన్నాల, రంగదాంపల్లి క్రాస్, నర్సాపూర్, సిద్దిపేట బైపాస్ ఎండ్(లింగారెడ్డిపల్లి), రామునిపట్ల, ఇబ్రహీంనగర్ నుంచి కస్తూరిపల్లి వరకు, మల్లారం, అనంతసాగర్ నుంచి శనిగరం, శంకర్‌నగర్, గుగ్గిళ్ల, గాగిళ్లపూర్ క్రాస్, తొటపల్లి, దేవక్కపల్లి రోడ్డు వరకు నిబంధనలు అమలుచేయనున్నారు.
- కల్వర్టులు, క్రాసింగ్‌ల దగ్గర సైతం 40 కిలో మీటర్ల స్పీడ్ లిమిట్‌ను పెట్టారు. మిగతా చోట్ల వాహనాల రద్దీని బట్టి 80కిలో మీటర్ల స్పీడ్‌ను కొనసాగించారు.
- ఆర్ అండ్ బీ అధికారులు విధించిన స్పీడ్ కంటే ఎక్కువ వెళితే ట్రాఫిక్ పోలీసులు స్పీడ్ గన్‌ల ద్వారా జరిమానా విధించనున్నారు.
- సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో రెండు చోట్ల స్పీడ్ గన్‌తో ట్రాఫిక్ పోలీసులు గట్టి నిఘా పెట్టారు. గతేడాది 80,663 వాహనాలకు రూ.8,34,60,525 జరిమానా విధించారు.
- రాత్రి సమయంలో నైట్ విజన్ స్పీడ్ గన్‌లను కూడా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

త్వరలో వేగ సూచిక బోర్డులు

జిల్లాలో 96 కిలో మీటర్ల మేర ఉన్న రాజీవ్ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. రాజీవ్ రహదారిపై హెచ్‌కేఆర్ ఆధ్వర్యంలో త్వరలో 40 స్పీడ్ లిమిట్ బోర్డులను ఏర్పాటు చేస్తాం. వాహనదారులు స్పీడ్ లిమిట్‌ను పాటించి సహకరించాలి.

– సుదర్శన్ రెడ్డి, ఈఈ, ఆర్‌అండ్‌బీ



తేనె పట్టేద్దాం

శాస్త్రీయ పద్ధతిలో తేనె టీగల పెంపకం

ములుగు ఫారెస్ట్‌ కాలేజీ అండ్‌ రీసెర్చ్‌ ఇనిస్టిట్యూట్‌లో రైతులకు శిక్షణ





బాక్సుల్లో ఉన్న తేనె టీగల గురించి రైతులకు వివరిస్తున్న అధికారి, శిక్షణకు హాజరైన రైతులు(ఫైల్‌)

తాటి జాన్‌రెడ్డి, సంగారెడ్డి డెస్క్‌..

వ్యవసాయానికి అనుబంధంగా తక్కువ ఖర్చుతో రైతులకు అధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే వాటిలో తేనె టీగల పెంపకం కూడా ఒకటి. వీటి పెంపకానికి వ్యయం, వనరులు, సమయ వినియోగం కూడా అతి తక్కువే. పర్యావరణంపై సానుకూల ప్రభావం చూపుతూ, పంట దిగుబడి పెంచడంలోనూ తేనె టీగల పాత్ర క్రియాశీలకం. శాస్త్రీయ పద్ధతిలో తేనె టీగల పెంపకంపై రైతులు దృష్టి సారించేలా..వారికి శిక్షణ ఇస్తూ ప్రోత్స హిస్తోంది ములుగులోని అటవీకళాశాల మరియు పరిశోధన సంస్థ. తేనె టీగల పెంపకం ద్వారా రైతులకు రెండు రకాల లాభాలు. ఒకవైపు అదనపు ఆదాయం సమకూర్చుకుంటూనే, మరోవైపు పంట దిగుబడి కూడా పెంచుకోవచ్చు.

ఐబీడీసీ రాష్ట్రంలోనే మొదటిది

ములుగులోని అటవీకళాశాల మరియు పరిశోధన సంస్థకు రాష్ట్రంలోనే మొదటిసారిగా ఇంటిగ్రేటెడ్‌ బీ కీపింగ్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌(ఐబీడీసీ) మంజూరైంది. నేషనల్‌ బీ కీపింగ్‌ అండ్‌ హనీ మిషన్‌లో భాగంగా దీనిని కేటాయించారు. కళాశాల డీన్‌ ప్రియాంక వర్గీస్‌(ఐఎఫ్‌ఎస్‌), జాయింట్‌ డైరెక్టర్‌ పి.శ్రీనివాస్‌రావు(ఐఎఫ్‌ఎస్‌), డిప్యూటీ డైరెక్టర్‌ ఏ.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఐబీడీసీ ప్రాజెక్టుకు హెడ్‌గా శైలజ వ్యవహరిస్తున్నారు. ఇంకా టీమ్‌లో ప్రాజెక్టు కోర్డినేటర్‌ డాక్టర్‌ వసీమ్‌, వెన్నెల రెడ్డి, శశాంక్‌ సుదర్శన్‌, నరేష్‌లు పనిచేస్తున్నారు. తేనెటీగల పెంపకంలో భాగంగా రైతులను ప్రోత్సహించేందుకు ముందుగా శిక్షణ పొందినవారికి బాక్సులు కూడా అందజేశారు. పెంపకం మొదలు పెట్టాక తేనె ప్రాసెసింగ్‌ కూడా నామినల్‌ ఫీజుతో చేసి ఇస్తారు.

అధిక తేనె ఉత్పత్తికి...

మకరందం, పుప్పొడిపైనే అధిక తేనె ఉత్పత్తి ఆధారపడి ఉంటుంది. ఒక్కో బాక్సు నుంచి రెండు నుంచి నాలుగు కేజీల వరకు తేనె తీయవచ్చు. బాక్సుల నుంచి తేనె తీయడానికి 30 నుంచి 40 రోజుల వ్యవధి పడుతుంది. ఇదంతా శాస్త్రీయ పద్ధతిలోనే జరుగుతుంది. కానీ కొందరు బాక్సుల్లో చక్కెర పెట్టి కృత్రిమంగానూ తేనె ఉత్పత్తి చేస్తున్నారు. ఇది నాణ్యమైనది కాదు.

పంట దిగుబడిలో కీలకం

వివిధ రకాల పంటల దిగుబడిలోనూ తేనె టీగల పాత్ర ఉంటుంది. పూలు పూసే మొక్కల్లో పరాగ సంపర్కానికి తేనెటీగలు తోడ్పాటు అందిస్తాయి. తద్వారా పంట దిగుబడి పెరుగుతుంది. మన రాష్ట్రంలో అయితే పొద్దుతిరుగుడు, ఆవాలు, నువ్వులు, ధనియాలు, వాము, కుసుమ, పుచ్చకాయల(వాటర్‌మిలాన్‌) దిగుబడిలో వీటి పాత్ర ఎక్కువగానే ఉంటుంది. పంట పొలాల్లోనూ తేనె టీగల పెంపకాన్ని ఇంటిగ్రేటెడ్‌ ఫార్మింగ్‌గా చేసుకోవచ్చు. ఒక ఎకరా విస్తీర్ణంలో 2 నుంచి 8 బాక్సుల వరకు ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే సేంద్రియ వ్యవసాయం చేసేచోట అయితేనే ఈ పెంపకానికి అనువుగా ఉంటుంది. ఫర్టిలైజర్‌, ఫెస్టిసైట్స్‌ వినియోగించే పంటల్లో మాత్రం ఇది వీలు పడదు.

పాలినేషన్‌ సపోర్ట్‌ కోసం...

మల్టీ నేషనల్‌ కంపెనీలు సీడ్‌ ప్రొడక్ట్‌లో భాగంగా పాలినేషన్‌ సపోర్ట్‌ కోసం ఏటా 4000 తేనెటీగల పెట్టెలను పొరుగురాష్ట్రం నుంచి తెప్పిస్తున్నాయి. ఇందుకోసం ఒక్కో బాక్సుకు రూ.1,500 నుంచి రూ.1,800 వరకు ఇస్తున్నారు. కేవలం ఒక్క నెల వ్యవధిలో ఈ బాక్సులను వినియోగించుకున్నందుకు దాదాపు రూ.60 నుంచి రూ.70 లక్షల వరకూ చెల్లిస్తున్నారు. ఈ ఆదాయం మన ప్రాంత రైతులకు వచ్చేలా చేసేందుకు అటవీకళాశాల, పరిశోధన సంస్థ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. తేనె, అదనపు ఉత్పత్తుల సేకరణ ప్రాసెసింగ్‌, మార్కెటింగ్‌కు కావాల్సిన మౌలిక వసతుల కల్పన అంతా అటవీకళాశాల చూసుకోనుంది. బీ వీనమ్‌ ఒక కేజీ కోటిరూపాయల వరకూ ఉంటుంది. సుమారు రెండు వేల బాక్సుల ద్వారా సంవత్సర కాలంలో ఒక కేజీ బీ వీనమ్‌ ఉత్పత్తి తీయవచ్చు. బీ పోలెన్‌లో సాధారణ చక్కెరలు, మాంసకృతులు, ఖనిజాలు, విటమిన్లు, కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఔషధ గుణాల్లో వాడే స్వచ్ఛమైన తేనెకు ఒక్కో కేజీ నాలుగు నుంచి ఐదు వేల రూపాయల వరకూ ధర ఉంటుంది. అటవీకళాశాలలో తేనె టెస్టింగ్‌ కూడా నామినల్‌ ఫీజుతో చేస్తారు.



నేను పెంచుతా



నా పేరు యాదగిరి, మాది సిద్దిపేట జిల్లా. అటవీకళాశాలలో తేనె టీగల పెంపకంపై శిక్షణ పొందా. పలువురి విజయగాథలు విన్నాక నాకు ఆసక్తి పెరిగింది. ఇక్కడ ఇచ్చిన శిక్షణ ఎంతగానో దోహదం చేసింది. సలహాలు, సూచనలు, బాక్సులు, టూల్స్‌ అన్నీ కాలేజీవారే ఇస్తారని చెప్పారు. త్వరలోనే తేనె టీగల పెంపకం ప్రారంభిస్తాం.

రైతులకు ఆదాయం వచ్చేలా..

మా కళాశాల డీన్‌, సీఎం ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్‌ గారి ప్రోత్సాహంతో రైతుల ఆదాయం పెంచుతూ, పర్యావరణాన్ని కాపాడేందుకు ఐబీడీసీ ప్రాజెక్టు రూపొందించాం. తేనెటీగల పెంపకం ద్వారా తేనె, మైనం మాత్రమే కాకుండా రాయల్‌ జెల్లీ, బీ వీనమ్‌, బీపోలెన్‌, ప్రొపోలీస్‌ ద్వారా కూడా ఎలా ఆదాయం పొందవచ్చో శిక్షణకు వచ్చే రైతులకు వివరిస్తున్నాం. ఔషధ విలువలున్న తేనెను కొంతమంది కల్తీ చేసి వ్యాపారం చేస్తున్నారు. దీనిని నిరోధించి శాస్త్రీయ పద్ధతిలో స్వచ్ఛమైన తేనెను ఉత్పత్తి చేసేందుకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నాం.

–శైలజ, ఐబీడీసీ ప్రాజెక్ట్‌ హెడ్‌



శిక్షణకు దరఖాస్తు ఇలా...

తేనె టీగల పెంపకంలో శిక్షణ తీసుకోవాలని అనుకునేవారు ప్రాజెక్టు కోఆర్డినేటర్‌ డాక్టర్‌ వసీమ్‌(7876531614)ను సంప్రదించాలి. నాలుగో విడత శిక్షణ ఏప్రిల్‌ 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఉంటుంది. ఏడురోజుల పాటు ఇచ్చే శిక్షణలో 25 మంది రైతులకు మాత్రమే అవకాశం ఉంటుంది. శిక్షణలో పాల్గొనే వారికి అల్పాహారం, భోజనంతో పాటు బస కూడా ఉచితంగానే కల్పిస్తారు. రానూపోనూ రవాణా చార్జీలు కూడా ఇస్తారు. శిక్షణ పూర్తయ్యాక రైతుల పేర్లు మధుక్రాంతి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్‌ చేయిస్తారు. తేనెటీగల పెంపకానికి కేంద్రం నుంచి అందే రాయితీలు, సామగ్రి తదితరాలకు దీని ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ములుగు అటవీకళాశాల, పరిశోధన సంస్థ ఆధ్వర్యంలోనూ ఫార్మర్స్‌ ప్రొడ్యూసర్‌ ఆర్గనైజేషన్‌ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు మొదలయ్యాయి.

శిక్షణ ఇలా...

తేనెటీగల రకాలు, వాటి జీవన చక్రం, జీవనం, ఆహార సేకరణ, పెంపకానికి కావాల్సిన సామగ్రి, స్థాన చలనం, తేనెటీగలకు వచ్చే వ్యాధులు, యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన జాగ్రత్తలు, ఉత్పత్తులు, ఉప ఉత్పత్తులు, రాయల్‌ జెల్లీ, ప్రొపోలిస్‌, బీ వీనమ్‌, బీ పోలెన్‌, తేనె సేకరణ, ప్రాసెసింగ్‌, మార్కెటింగ్‌, తేనెటీగల పెంపకంలో లాభాలు గడించిన రైతుల సక్సెస్‌ స్టోరీలు ఇలా అన్నీ వివరిస్తారు.

మూడో బ్యాచ్‌...

ములుగులోని అటవీకళాశాల, పరిశోధన సంస్థలో ఇప్పటికే తేనె టీగల పెంపకంలో రెండు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశారు. మొదటి బ్యాచ్‌కు మార్చి 14 నుంచి 20వ తేదీ వరకు శిక్షణ ఇవ్వగా, సిద్దిపేట, సంగారెడ్డి, నిజామాబాద్‌, మేడ్చల్‌, కామారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన 25 మంది రైతులు పాల్గొన్నారు.

- మార్చి 23వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఇచ్చిన శిక్షణలోనూ సిద్దిపేట, నిజామాబాద్‌, కొమురం భీం ఆసిఫాబాద్‌, రంగారెడ్డి, మహబూబ్‌నగర్‌, ములుగు, ఆదిలాబాద్‌ జిల్లాలకు చెందిన 25 మంది రైతులు పాల్గొన్నారు.
- మూడో బ్యాచ్‌ శిక్షణ ఏప్రిల్‌ 10వ తేదీ ప్రారంభం కాగా, 16వ తేదీతో ముగియనుంది. ఇందులో సిద్దిపేట, సంగారెడ్డి, నిజామాబాద్‌, ములుగు, కరీంనగర్‌, జిల్లాలకు చెందిన 25మంది రైతులు పాల్గొన్నారు.

పార్ట్‌ టైం ఉద్యోగం పేరిట మోసం

పటాన్‌చెరు టౌన్‌: ఓ సైబర్‌ నేరగాడు పార్ట్‌ టైం ఉద్యోగం పేరిట మహిళను మోసగించాడు. పోలీసుల కథనం ప్రకారం...అమీన్‌పూర్‌ పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌ పటేల్‌గూడకు చెందిన అభిరామికి గతనెల 31న పార్ట్‌టైం ఉద్యోగం పేరిట ఓ మెసేజ్‌ వచ్చింది. దానిపై క్లిక్‌ చేయగా టెలిగ్రామ్‌లోకి వెళ్లింది. అక్కడ తన వివరాలు నమోదు చేసింది. ముందుగా రూ.1000 ఇన్‌వెస్ట్‌ చేస్తే రూ.1300 రిటర్న్‌ పంపాడు. టాస్క్‌ పూర్తిచేసిన తర్వాత నగదు ఇస్తానని ఆశచూపి పలుదఫాలుగా రూ.53 వేల నగదరు డిపాజిట్‌ చేయించుకున్నాడు. తిరిగి నగదు చెల్లించాలని అభిరామి మెస్సేజ్‌ చేసినా స్పందించలేదు. దీంతో మోసపోయానని గుర్తించిన ఆమె సైబర్‌ క్రైం టోల్‌ఫ్రీ నంబర్‌ 1930కు కాల్‌చేసి ఫిర్యాదు చేసింది.పోలీసులు వెంటనే అభిరామి అకౌంట్‌ నుంచి ట్రాన్స్‌ఫర్‌ అయిన రూ. 48 వేలను ఫ్రీజ్‌ చేశారు. జరిగిన మోసంపై గురువారం బాధితురాలు అమీన్‌పూర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రజ్ఞాపూర్‌ శివారులో గుర్తుతెలియని మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గజ్వేల్‌ రూరల్‌: ప్రజ్ఞాపూర్‌ గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. గజ్వేల్‌ పోలీసుల కథనం ప్రకారం.. ప్రజ్ఞాపూర్‌కు చెందిన కదుల్ల జగదీశ్వర్‌ పొలం పక్కన మర్రి చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం అటుగా వెళ్లిన జగదీశ్వర్‌ విషయం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందికి దించి పోస్టుమార్టం కోసం గజ్వేల్‌ గవర్నమెంట్‌ హాస్పిటల్‌కు తరలించారు. మృతుడి వయస్సు సుమారు 35 ఏళ్ల వరకు ఉంటుంది. ఒంటిపై ఎరుపు రంగు షర్ట్‌, నలుపు రంగు ప్యాంట్‌ ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మురళి తెలిపారు. వివరాల కోసం గజ్వేల్‌ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

ఓఆర్‌ఆర్‌ వద్ద ...

పటాన్‌చెరు టౌన్‌: ఎగ్జిట్‌-3 ఓఆర్‌ఆర్‌ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. పటాన్‌చెరు ఎస్సై దుర్గయ్య కథనం ప్రకారం.. మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన వంశీకృష్ణ ఓ ప్రైవేట్‌ స్కూల్‌ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఎగ్జిట్‌-3 ఓఆర్‌ఆర్‌ వద్ద మూత్ర విసర్జన కోసం చెట్లపొదల్లోకి వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. ఆయన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి వయస్సు 45 సంవత్సరాలు ఉంటుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

భర్త ఇంటి ఎదుట ధర్నా చేసిన భార్యపై కేసు

మద్దూరు(హుస్నాబాద్‌): భర్త ఇంటి ఎదుట ధర్నా చేసిన భార్య, అత్తింటివారు, మరికొందరిపై కేసు నమోదైంది. ఎస్సై నారాయణ కథనం ప్రకారం.. మండలంలోని నర్సయ్యపల్లి గ్రామానికి చెందిన బద్దిపడిగె శ్రీనివాస్‌రెడ్డి ఆయన భార్య అంజలి మధ్య కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. దీనిపై కోర్టులో కేసు నడుస్తోంది. ఈ క్రమంలో భార్య అంజలి కాపురానికి తీసుకెళ్లాలని, కుమారుడికి ఆస్తి రాసివ్వాలని కొరుతూ తల్లిదండ్రులు, గ్రామస్తులతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేసింది. దీనిపై శ్రీనివాస్‌రెడ్డి తల్లి ప్రమీల ఫిర్యాదు చేయడంతో అంజలి, ఆమె తల్లిదండ్రులు, గ్రామనికి చెందిన మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

వడదెబ్బతో మహిళ మృతి



మహేశ్వరి (ఫైల్‌)

హుస్నాబాద్‌: హుస్నాబాద్‌ పట్టణం ఎల్లంబజార్‌కు చెందిన బండ మహేశ్వరి (47) వడదెబ్బతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం కూలి పనులకు వెళ్లిన మహేశ్వరి సాయంత్రం ఇంటికి రాగానే వాంతులు, విరోచనాలతో బాధపడుతూ మృతిచెందింది. మృతురాలికి భర్త, కొడుకు ఉన్నారు.

వృద్ధుడు అదృశ్యం



దున్నపోతుల బుచ్చయ్య (ఫైల్‌)

కొండపాక(గజ్వేల్‌): పశువులను మేతకోసం తీసుకెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. కుకునూరుపల్లి ఎస్సై పుష్పరాజ్‌ కథనం ప్రకారం .. మండలంలోని కోనాయిపల్లికి చెందిన దున్నపోతుల బుచ్చయ్య ఈనెల 11న ఉదయం పశువులను మేతకు తీసుకెళ్తానని ఇంటినుంచి బయటకు వెళ్లాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారు, వ్యవసాయ బావుల పరిసరాల్లో వెతికారు. ఆచూకీ దొరకకపోవడంతో బుచ్చయ్య కొడుకు చంద్రయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సిద్దిపేటలో...

సిద్దిపేటకమాన్‌: సిద్దిపేటలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. టూటౌన్‌ ఏసీపీ రవికుమార్‌ కథనం ప్రకారం.. పట్టణంలోని శంకర్‌నగర్‌కు చెందిన బాలరాజు(46) సోదరుడు అశోక్‌తో కలిసి ఉంటున్నాడు. మతిస్థిమితం లేని బాలరాజు గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సోదరుడు అశోక్‌ టూటౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

20 మంది మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం..మంగళవారం, బుధవారం నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో 20 మంది పట్టుబడినట్లు తెలిపారు. వీరిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 17 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, ముగ్గురికి రూ. 3 వేయ్యొప్పున జరిమానా విధించారని సీఐ వివరించారు.

భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్‌: మద్యంమత్తులో భార్యతో గొడవపడ్డ ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పటాన్‌చెరు ఏఎస్సై మల్లయ్య కథనం ప్రకారం... మండలంలోని చిన్నకంజర్ల గ్రామానికి చెందిన రాజు గౌడ్‌ (45) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 11న భార్య బాలమణితో గొడవపడి ఇంటినుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు రాజుగౌడ్‌ కోసం గాలించగా గురువారం చిన్నకంజర్ల గ్రామశివారులో తన పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

కారు ఢీకొని ...



ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. హద్నూర్‌ ఎస్సై వినయ్‌కుమార్‌ కథనం ప్రకారం..టెక్మాల్‌ మండలం బొడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన వీరయ్యస్వామి(42) ద్విచక్ర వాహనంపై భార్య శివలీల, కూతురు శివానితో కలిసి గంగ్వార్‌ నుంచి బొడ్మట్‌పల్లికి వస్తుండగా ఎస్‌ఎల్‌ఆర్‌ ఫంక్షన్‌ హాల్‌ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరయ్యస్వామి, భార్య, కూతురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జహీరాబాద్‌ గవర్నమెంట్‌ హాస్పిటల్‌కు తరలించారు.అయితే అప్పటికే వీరయ్యస్వామి మృతి చెందాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో శివలీల, శివానిలను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



బాలాగౌడ్‌ (ఫైల్‌)

నిజాంపేట(మెదక్‌): కల్వకుంట గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. స్థానికుల కథనం ప్రకారం..మండలంలోని తిప్పన్నగుల్ల గ్రామానికి చెందిన గోట్టిపర్తి బాలాగౌడ్‌ (38) భార్యతో కలిసి గురువారం సిద్దిపేటకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా కల్వకుంట గ్రామశివారులో జేసీబీ ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే చనిపోయాడు. భార్య శోభకు తీవ్రగాయాలయ్యాయి.

గాయపడ్డ యువకుడు ..



సాయిరాంరెడ్డి (ఫైల్‌)

పటాన్‌చెరు టౌన్‌: కారుప్రమాదంలో గాయపడ్డ ఓ యువకుడు చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం బచ్చుగూడెంకు చెందిన సాయిరాంరెడ్డి (18) ఈనెల 5న స్నేహితుడు సాయిమోహన్‌తో కలిసి టీతాగేందుకు కారులో బచ్చుగూడెం నుంచి సర్వీస్‌ రోడ్డు మీదగా ముత్తంగికి బయలుదేరారు. నక్కవాగు సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయిరాంరెడ్డికి తీవ్రగాయాలు కాగా.. మోహన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక కాంటినెంటల్‌ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం సాయిరాంరెడ్డి మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి గాయాలు...

పటాన్‌చెరు టౌన్‌: టాటాఏస్‌ను కంటైనర్‌ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం..గురువారం మండలంలోని ముత్తంగి రింగ్‌ రోడ్డుపై ఆగి ఉన్న టాటాఏస్‌ను వెనుకాల నుంచి వచ్చిన కంటైనర్‌ ఢీకొటింది. ఈ ప్రమాదంలో టాటాఏస్‌ డ్రైవర్‌ శ్రీకాంత్‌(28)కు తీవ్రగాయాలుకాగా, మరో వర్కర్‌ రవికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ శ్రీకాంత్‌ను చికిత్స కోసం ఓ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువతి...



కల్పన మృతదేహం

చేగుంట(తూప్రాన్‌): పురుగుల మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. మాసాయిపేట ఎస్సై ప్రకాశ్‌గౌడ్‌ కథనం ప్రకారం.. వెల్దుర్తి మండలం యశ్వంతరావుపేటకు చెందిన కల్పన (22)కు మూడేళ్ల క్రితం మాసాయిపేటకు చెందిన గణేశ్‌తో వివాహం అయింది. ఆ తర్వాత భర్త గణేశ్‌, అత్త నాగమణి తరచూ కల్పనతో గొడవపడేవారు. బుధవారం కూడా గొడవలు జరిగాయి. మనస్థాపానికి గురైన కల్పన అదేరోజు ఇంట్లో ఎవరూ లేనిసమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సనిమిత్తం తూప్రాన్‌ ప్రభుత్వ ఇస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలి తండ్రి విఠల్‌ ఫిర్యాదు మేరకు భర్త, అత్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

నీటితొట్టిలో పడి రెండేళ్ల చిన్నారి మృతి



సాన్విక (ఫైల్‌)

దుబ్బాక: నీటితొట్టిలో పడి రెండేళ్ల చిన్నారి మృతిచెందింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. దౌల్తాబాద్‌ మండలం శేరుపల్లి గ్రామానికి చెందిన సంద సాయి కిరణ్‌ రమ్య దంపతులు గురువారం కూతురు సాన్విక (2)ను తాతదగ్గర ఉంచి పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఆడుకుంటూ..తిరుగుతున్న సాన్విక అరుబయట ఉన్న నీటితొట్టి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోయింది. పాప కనిపించకపోవడంతో ఆందోళనకు గురైనా తాత, కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. చివరికి తొట్టిలో చూడగా ఊపిరాడక కొట్టుకుంటూ స్వానిక కనిపించింది. వెంటనే చిన్నారిని బయటకు తీసి గజ్వేల్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మర్గమధ్యంలో మృతి చెందింది. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కూతురు కళ్లముందే విగతజీవిగా మారడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. అయ్యో...బిడ్డా.. రెండేళ్లకే నూరేళ్లు నిండాయా అంటూ తల్లి రోదించిన తీరు కంటతడిపెట్టించింది.

దంపతుల ఆత్మహత్యాయత్నం

గజ్వేల్‌రూరల్‌, జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): 'డబ్బులు కట్టి మోసపోయాం. మా డబ్బులు మాకు ఇప్పించండి' అని బాధితులు ఒత్తిడి చేయడంతో భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. జగదేవ్‌పూర్‌ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన జనగామ మాణిక్యం ఆర్‌ఎంపీగా పనిచేశాడు. 2017లో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కొన్నినెలల పాటు చికిత్స పొంది ఇంటి వద్దే ఉన్నాడు. 2018లో ఆయనకు గజ్వేల్‌కు చెందిన బంధువు చంద్రం ద్వారా సన్‌పరిహార్‌ మార్కెటింగ్‌ సీఈవో మెతుకు రవీందర్‌తో పరిచయం ఏర్పడింది. ఈక్రమంలో రవీందర్‌ మాయ మాటలు చెప్పి మాణిక్యంను చిట్‌ ఫండ్‌ ఏజెంట్‌గా నియమించాడు. కస్టమర్లను చిట్‌ ఫండ్‌లో చేర్పిస్తే లక్షకు ఆరు వేల చొప్పున నెలకు కమీషన్‌ వస్తుందని నమ్మించాడు. డబ్బు ఆశకుపోయిన మాణిక్యం గ్రామంలోని 10 మందిని చిట్‌ ఫండ్‌లో చేర్పించి దాదాపు రూ.10 లక్షల వరకు కట్టించాడు. ఐదేళ్ల గడిచినా డబ్బులు తిరిగి రాకపోవడంతో బాధితులు నిలదీశారు. ఆందోళనకు గురైన మాణిక్యం సన్‌ పరిహార్‌ గ్రూప్‌ సీఈవో రవీందర్‌ను అడిగితే 'త్వరలో మీ డబ్బులు చెల్లిస్తాను' అని హామీ ఇచ్చాడు. ఆ తర్వాత సీఈవో ఫోన్‌ ఎత్తకపోవడంతో బాధితులంతా డబ్బులు ఇప్పించాలని మాణిక్యంపై ఒత్తిడి చేశారు. గురువారం గజ్వేల్‌లోని మాణిక్యం బంధువైన చంద్రం ఇంటివద్ద గొడవకు దిగారు. దీంతో మనస్థాపానికి గురైన మాణిక్యం ఆయన భార్య ఉమారాణి పురుగుల మందు తాగారు. గమనించిన స్థానికులు వారిని గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. ఈ విషయమై స్థానిక సీఐని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

భూంపల్లిలో గుడిసెలు ధ్వంసం



న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధితులు

మిరుదొడ్డి(దుబ్బాక): వివాదాస్పద ఇంటి స్థలంతో పాటు మంత్రాలు చేస్తున్నారన్న నెపంతో కొందరు గుడిసెలు ధ్వంసం చేశారు. అడ్డుకోబోయిన వారిపై దాడిచేశారు. బాధితులు, గ్రామస్తుల కథనం ప్రకారం... దుబ్బాక మండలం గంభీర్‌పూర్‌ గ్రామానికి చెందిన అబ్రమైన పోచవ్వ, మధు, శ్యామల, నర్సింహులు, శ్రీకాంత్‌, లక్ష్మి, రాములు కుటుంబ సభ్యులతో కలిసి పదేళ్ల క్రితం భూంపల్లి మండల కేంద్రానికి వసలవచ్చారు. గ్రామ శివారులో గుడిసెలు వేసుకుని కూలిపనులు చేసుకుంటూ బతుకుతున్నారు. ఓ ఇంటి స్థలం విషయమై అదే ఏరియాలో ఉంటున్న కొందరితో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇది దృష్టిలో పెట్టుకొని కొందరు లక్ష్మి, రాములు మంత్రాలు చేస్తున్నారని ఆరోపిస్తూ గురువారం వలసవచ్చిన వారి నాలుగు గుడిసెలను ధ్వంసం చేశారు. అడ్డుకోబోయిన పోచవ్వపై దాడిచేశారు. దీంతో ఆమె కుడి చేతికి, తలకు గాయాలయ్యాయి. ఊరినుంచి వెళ్లగొట్టాలన్న ఉద్దేశంతో నిందమోపి గుడిసెలు ధ్వంసం చేశారని బాధితులు వాపోయారు. న్యాయం చేయాలని భూంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగరాజు తెలిపారు.